ప్రజాశక్తి
బుధవారం 29 అక్టోబర్ 2025
5
పార్వతీపురం మన్యం

పెద్ద గెడ్డ రిజర్వాయర్ పరిశీలన

ప్రజాశక్తి – పాచిపెంట

తుఫాన్ నేపథ్యంలో మండలంలోని గల పెద్దగెడ్డ రిజర్వాయర్‌ను పార్వతీపురం సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి మంగళవారం పరిశీలించారు. రిజర్వాయర్ దిగువ గ్రామాల భద్రత కోసం పెద్దగెడ్డ డిఇకి పలు సూచనలు చేసి దిశా నిర్దేశం చేశారు. గతంలో సబ్‌మెర్జిబుల్ పరిస్థితులు, ప్రస్తుత రిజర్వాయర్ ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను అడిగి తెలుసుకున్న ఆమె ప్రజలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే అమ్మవలస కాజ్‌వేను తనిఖీ చేసిన ఆమె సబ్ డివిజనల్ స్థాయి అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో రానున్న 48 గంటల్లో చేపట్టాల్సిన చర్యలను ముమ్మరం చేశారు. అనంతరం పాచిపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించి పలు మార్గదర్శకాలను జారీచేశారు. ఈ పర్యటనలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మక్కువలో నీట మునిగిన వరిపంట

నీట మునిగిన వరి పొలాలు

- అన్నదాత కుదేలు
- రెండు రోజులుగా భారీ వర్షాలు
- కొంప ముంచిన మొంథా తుపాన్
- 259 ఎకరాల్లో వరి, పత్తి పంటకు నష్టం

ప్రజాశక్తి – పార్వతీపురం

జిల్లాలో మొంథా తుపాన్ ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. అక్కడక్కడా వరి పొలాలు నీటిలో మునిగి పోయాయి. పార్వతీపురం మండలంలోని ములగ, మక్కువ మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట నీట పాలైంది. మరి కొద్ది రోజుల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి చేలు నేలకొరిగాయి. మండలంలోని 259 ఎకరాల్లో వరి, పత్తి పంటలకు నష్టం జరిగినట్టు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. సాలూరు, పాచిపెంట, మక్కువ, గరుగుబిల్లి, బలిజిపేట మండలాల్లోని 20 గ్రామాల్లో 113మంది రైతుల పంటలకు నష్టం జరిగిందని చెపుతున్నారు. బుధవారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం వున్నందున మరింత నష్టం పెరుగుతుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో వరి పంటకు భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లాలో మొక్కజొన్న, పత్తి పంటలకు భారీ వర్షాలు కారణం గా తీరని నష్టం వాటిల్లింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటి నుంచి వరుస తుపాన్లు వెంటాడుతుండడంతో రైతులు తేరుకోలేని పరిస్థితి నెలకొంది.

మక్కువ : చేతికి అందివచ్చిన వరి పంట తుపాను కారణంగా నేలకొరిగి నీట మునగడంతో రైతు విలవిలలాడుతున్నాడు. మండలంలో ఈదురు గాలులతో కూడినవర్షాలకు చాలా చోట్ల వరి పంట నేలకొరిగింది. కొన్నిచోట్ల పూతదశలో ఉండగా, మరి కొన్నిచోట్ల కోత దశకు చేరుకున్న తరుణంలో పంట పూర్తి స్థాయిలో దెబ్బతిందని రైతులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. శంబర, కొనలో సుమారు 20 ఎకరాల వరకు వరి పంటకు నష్టం వాటిల్లినట్లు రైతులు పుచ్చల సత్యనారాయణ, ఎస్.శంకర్, టి.రమణ, కోన గ్రామానికి చెందిన దాజేటి రామకృష్ణ తదితరులు వాపోతున్నారు ఇదిలా ఉండగా వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్‌ను తహశీల్దార్ భరత్ కుమార్, ఎంపిడిఒ అర్జునరావు ఇరిగేషన్ ఇంజినీర్లుతో కలిసి ప్రాజెక్టులో నీటిమట్టాన్ని పరిశీలించారు.

కాలువలో పడి ఆవు మృతి

మండలంలోని శంబలో మేత కోసం వెళ్లిన ఆవు ఉధృతంగా ప్రవహిస్తున్న వెంగళరాయ లింక్ ఛానల్ కాలువలోకి దిగి మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. శంబర గ్రామానికి చెందిన రైతు బలగ పోలినాయుడుకు చెందిన పాడి ఆవును మంగళవారం మధ్యాహ్నం మేపు కోసం వెంగళరాయ ప్రాజెక్ట్ పరిధిలో లింక్ ఛానల్ వైపు మేత కోసం తోలుకెళ్లాన్నాడు. భారీ వర్షాల కారణంగా పొలాల నీరు కాలువలోకి చేరడంతో కాలువ ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ నేపథ్యంలో ఆవు కాలువలో గల పచ్చి గడ్డి మేత కోసం దిగింది. కాలువలో వరద నీరు ఉధృతంగా రావడంతో ఆవు గట్టు పైకి ఎక్కలేక చనిపోయిందని రైతు పోలినాయుడు బోరున విలిపిస్తున్నాడు. పాడి ఆవు మృతిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్టు రైతు తెలిపారు.

వర్షపాతం వివరాలు

పార్వతీపురం : మొంథా తుపాను ప్రభావంతో జిల్లాలో మంగళవారం విస్తారంగా వర్షాలు కురిశాయి. అత్యధికంగా సీతంపేట మండలంలో 54.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే సీతంపేట, సాలూరు, పాలకొండ తదితర మండలాల్లోనూ భారీవర్షాలు కురిశాయి. మంగళవారం ఉదయం 8గంటల నుంచి రాత్రి 9గంటల వరకు కురిసిన వర్షపాతం మండలాల వారీగా వివరాలు..

మండలం	వర్షపాతం (మి.మీ.లో)
పాచిపెంట	50.4
సీతంపేట	54.6
సాలూరు	36.6
బలిజిపేట	31.6
పాలకొండ	38.8
భామిని	23.8
వీరఘట్టం	24.6
గరుగుబిల్లి	20.4
పార్వతీపురం	25.4
సీతానగరం	20.0
మక్కువ	27.8
కురుపాం	19.8
గుమ్మలక్ష్మీపురం	18.3
జియ్యమ్మవలస	17.0
కొమరాడ	09.2
జిల్లా మొత్తం:	**418.3**

టంకు గ్రామంలో కూలిపోయిన ఇంటి పైకప్పు

రెండిళ్ల గోడలు నేలమట్టం

గుమ్మలక్ష్మీపురం : తుపాను ప్రభావం గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీపై పడింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లోవముఠా ప్రాంతంలోని గొయ్యిపాక పంచాయతీ టంకు గిరిజన గ్రామంలో కిల్లక సుందరరావు, కోలక డొంబమ్మ ఇంటి గోడలు, పైకప్పు కూలి నేలమట్టమయ్యాయి. ప్రమాదాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు ప్రాణభయంతో ఇంటి నుంచి బయటకు పరుగులు తీశారు. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మట్టి గోడలు కావడంతో వర్షానికి తడిసి కరిగి కూలినట్లు బాధితులు తెలిపారు. ఘటనపై గ్రామస్తులు వెంటనే అధికారులకు సమాచారం అందించారు.

కూలిన గోడ

వీరఘట్టం : మండల కేంద్రంలోని సెగిడి వీధికి చెందిన బేతా గోవింద పూరింటి గోడ మంగళవారం కూలిపోయింది. తుఫాను వల్ల కురుస్తున్న వర్షానికి గోడ నాని పడిపోవడంతో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

పెద్దగెడ్డ నుంచి దిగువకు విడిచిన పెట్టిన వరద నీరు

పెద్ద గెడ్డ జలాశయం నుంచి 6వేల క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి – పాచిపెంట

మండలంలోని పెద్దగెడ్డ జలాశయం నీటిమట్టం మంగళవారం నాటికి 213.4 మీటర్లుకు చేరింది. గరిష్ట నీటిమట్టం 213.8 మీటర్లు కాగా, ఎడతెరిపిలేని వర్షంతో జలాశయంలోకి 6,500 క్యూసెక్కుల వరద నీరు చేరుతుంది. దీంతో జలాశయంలో 80 శాతానికి మించి నీటి నిల్వ ఉంచకూడదనే పై అధికారుల ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు స్పిల్‌వే రెండు గేట్లు ద్వారా వేగావతి నదిలోకి 6వేల క్యూసెక్కుల నీటిని మంగళవారం విడిచిపెట్టారు. నీరు విడుదల సందర్భంగా జలాశయం దిగువ వేగావతి నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

తుపాను ప్రభావాన్ని సమిష్టిగా ఎదుర్కొందాం : మంత్రి

పార్వతీపురం : మొంథా తుపాను ప్రభావాన్ని జిల్లా యంత్రాంగం, ప్రజలు, మీడియా సహకారంతో సమష్టిగా ఎదుర్కొందామని రాష్ట్ర మహిళా, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. మంగళవారం జిల్లా పర్యటనకు విచ్చేసిన మంత్రి తుఫాన్ ముందస్తు చర్యలపై విలేకరులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు, ప్రత్యేక బృందాలు అప్రమత్తమై ముమ్మరమైన సహాయక చర్యలు చేపట్టి, కష్టపడి పని చేస్తున్నారన్నారు. ప్రజలు భయపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు మంత్రి విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రత్యేక అధికారి, కలెక్టర్, ఎస్పీ, జెసి వంటి ఉన్నతాధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారన్నారు. అనుకోని సంఘటనలను ఎదుర్కొనేందుకు వీలుగా ప్రతి గ్రామంలో మాక్ డ్రిల్స్ ఏర్పాటు చేశారని, జిల్లా, డివిజనల్, మండల స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూములను ఏర్పాటు చేశారని తెలిపారు. ఇక్కడ తహశీల్దార్, ఎంపిడిఒ, ఎలక్ట్రికల్, ఇరిగేషన్, పోలీస్ శాఖల అధికారులు అందుబాటులో ఉన్నారని అన్నారు. అత్యవసర సమాచారం కోసం ప్రజలు 1912కు ఫోన్ చేయవచ్చని చెప్పారు. పోలీస్, ఫైర్ అవసరాల కోసం 100 లేదా 101 నంబర్లను సంప్రదించాలని కోరారు. కొండ చరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న హిల్ టాప్ ఏరియాలో ఉన్నవారు అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. వర్షాల తీవ్రతను గుర్తించి, వెంటనే డ్యూటీలో చేరి ప్రజలకు సేవ చేయడానికి అప్రమత్తమైనఅధికారులకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విలేకరుల సమావేశంలో జిల్లా ప్రత్యేక అధికారి నారాయణ భరత్ గుప్తా, కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి, జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి, జెసి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాగావళి , జంఝావతి నదుల్లో సల్పంగా పెరిగిన నీటిమట్టం

జంఝావతి రబ్బరు డ్యాంలో చేరిన వరదనీరు

కొమరాడ : తుఫాన్ కారణంగా మండలంలోని నాగావళి, జంఝావతి నదుల్లో వరద ప్రవాహం స్వల్పంగా పెరిగింది. దీంతో జంఝావతి ప్రాజెక్టు వద్ద రబ్బర్ డ్యాంలో పూర్తిగా కిందకు దించేసి వరద నీటిని దిగువ ప్రాంతానికి అధికారులు విడిచిపెడుతున్నారు. వరద ప్రవాహం ఏ సమయంలోనైనా ఉధృతంగా పెరితే ప్రాజెక్టు డెమో దెబ్బ తినే అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతో రబ్బర్ డ్యామును కిందకు దించేసినట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలుపుతున్నారు. అలాగే నాగావళి నది ప్రవాహం పెద్దగా పెరగకపోవడంతో సమీప గ్రామాల ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నారు.

తోటపల్లి రెండు గేట్లు ద్వారా నీరు విడుదల

గరుగుబిల్లి : తుఫాన్ కారణంగా తోటపల్లి జలాశయం నుంచి రెండు గేట్లు ద్వారా నీటిని అధికారులు కిందికి విడుదల చేస్తున్నారు. మంగళవారం నాటికి 1.546 టిఎంసిలుగా నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫో సామర్థ్యం 4196 క్యూసెక్కులు, ఎల్ఎంసి 80 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో క్యూసెక్‌లు.అవుట్ ఫ్లో 2807 క్యూసెక్కులు ఉన్నట్లు జె ఇ కిషోర్ తెలిపారు. ప్రస్తుతం రెండు గేట్‌ను విడుదల చేశామని, బ్యారేజ్ పరిసర ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పాఠశాలలో చేరిన వర్షం నీరు

పెద్దూరు పాఠశాలలో చేరిన వరద నీరు

వీరఘట్టం : తుఫాను ప్రభావం వల్ల గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని దశమంతపురం సచివాలయం పరిధి పెద్దూరు గిరిజన గ్రామ పాఠశాలలో వర్షం నీరు చేరింది. ఇక్కడ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 21 మంది విద్యను కొనసాగిస్తున్నారు. ఈ భవనం పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరుకోవడంతో చిన్నపాటి వర్షం పడినా వర్షం నీరు స్లాబ్ పైనుంచి కిందకు జారుతుంది. విద్యార్థులు నీటిని తొలగించి అందులోనే కూర్చొని ఆనవాయితీగా వస్తుందని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫాను కారణంగా పాఠశాలలకు మూడు రోజులు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులకు ఆ నీటిని తొలగించే శ్రమ తప్పిందని, అయితే భవనం పైన పెచ్చులు ఊడి పడడంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రమాదం జరగకముందే విద్యాశాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న సువర్ణముఖి

సీతానగరం : మండలంలోని కొత్తవలస వద్ద సువర్ణముఖి నది ఇటీవల కురుస్తున్న వర్షాలకు పొంగిప్రవహిస్తోంది. వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు నీటిని కిందికి విడిచిపెట్టడంతో సువర్ణముఖి నది నీటి ప్రభావం పెరిగింది. దీంతో నదీ పరీవాహక గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఇప్పటికే దండోరా వేయించారు.

తుపాను పట్ల అప్రమత్తం :కలెక్టర్

పార్వతీపురం : మొంథా తుపాను నేపథ్యంలో జిల్లాలో జిల్లా పరిపాలన యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తమైందని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం తుఫాన్‌పై కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. ఈ తుఫాను మంగళవారం రాత్రికి తీరం చేరే అవకాశం ఉన్నందున, జిల్లా యంత్రాంగం అన్ని ముందు జాగ్రత్త చర్యలను చేపట్టిందన్నారు. ఈ రాత్రి నుండి రేపు సాయంత్రం వరకు పూర్తి స్థాయిలో సిబ్బంది అందరూ హెడ్ క్వార్టర్స్‌లోనే ఉండాలని ఆదేశాలు జారీ చేయబడ్డాయని తెలిపారు.

600 విద్యుత్ స్తంభాలు సిద్ధం : ట్రాన్స్‌కో ఎస్ఇ

ప్రజాశక్తి – వీరఘట్టం

తుఫాను తీవ్రత వల్ల ఎక్కడ ఎటువంటి విద్యుత్ సమస్య లేకుండా ఉండేందుకు 600 విద్యుత్ స్తంభాలు సిద్ధంగా ఉంచామని ట్రాన్స్‌కో ఎస్ఇ కె.మల్లికార్జునరావు అన్నారు. మంగళవారం స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయాన్ని సందర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. సిబ్బందిని కూడా అప్రమత్తం చేశారు. ఇందుకు సంబంధించి 240 మంది సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. 17 వాహనాలు హెడ్ క్వార్టర్స్ వద్ద ఉంచామని, వీటిని పూర్తిస్థాయిలో పర్యవేక్షించేందుకు ఇద్దరు డిఇలతోపాటు 16 మంది ఎఇలను కూడా నియమించామన్నారు. ఏ అవసరమొచ్చినా వారు అందుబాటులో ఉంటారని ఆయన స్పష్టం చేశారు. 12 డ్రిల్లింగ్ మిషన్లు పది జనరేటర్లు సిద్ధం చేసినట్లు తెలిపారు. చెట్లు తొలగించే 12 మిషన్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. విద్యుత్ సమస్య వస్తే 1912కు కాల్ చేయవచ్చునని వినియోగదారులను కోరారు. పిఎం సూర్యఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీల నుంచి పదివేల దరఖాస్తులు వచ్చాయని సోలార్ ప్లాంట్లు ఏర్పాటుకు అద్దె కింద ఎస్సీ, ఎస్టీలకు నెలకు రూ.200 చెల్లించనున్నట్లు తెలిపారు. పిఎం సూర్యఘర్ కింద రూ.2లక్షలు విలువ చేసే మూడు వేల కిలోవాట్స్, రెండు లక్షల బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రూ.78 వేలు రాయితీ పోనూ రూ.లక్షా22 వేలకు బ్యాంకు ద్వారా రుణాలిచ్చి వాటిని నెలవారీ పద్ధతిలో చెల్లింపులు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల వినియోగదారులు ముందుకు రావాలన్నారు. తుఫాను తీవ్రత వల్ల విలువైన ఎసి, ఫ్రిజ్, టీవీల ప్లగ్‌లను తీసివేయాలన్నారు. విద్యుత్ సమస్యలకు సంబంధించి పార్వతీపురంలో 7382585686, పాలకొండలో 7382585575 కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేయవచ్చునని వినియోగదారులను కోరారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందజేశారు. ఆయనతో పాటు స్థానిక ట్రాన్స్‌కో ఎఇ కె.సోమేశ్వరం ఉన్నారు.

కమాండ్ కంట్రోల్‌రూం ఏర్పాటు

సాలూరు : తుపాను నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా నదీ పరివాహక ప్రాంతాలైనా తోణాం, మామిడిపల్లి, తుండ సచివాలయాల పరిధిలో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. నది పరీవాహక ప్రాంతాల్లో ప్రతి ఏటా వర్షాకాలంలో ఎదురయ్యే వరద ముప్పు, ముంపు సమస్యలన్నీ ఇన్నీ కావు. అయినప్పటికీ, ఇంతకు ముందు కేవలం మండల కేంద్రంలోనే కంట్రోల్ రూమ్ ఉండేది. ఆ సమాచారం గ్రామాలకు చేరేసరికి విలువైన సమయం వృథా అయ్యేది. ప్రస్తుతం అధికారులు అప్రమత్తత ప్రకటించడమే కాకుండా, సమస్య మూలాల వద్దే పరిష్కారం చూపాలని నిర్ణయించుకున్నారు. ప్రతి సచివాలయంలోనూ తాత్కాలిక కమాండ్ కంట్రోల్ రూమ్‌ను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేశారు. వైర్‌లెస్ కమ్యూనికేషన్ పరికరాలు, బ్యాటరీ బ్యాకప్ సౌకర్యాలను కూడా ఏర్పాటు చేశారు. తుఫాన్ సమయంలో విద్యుత్ సరఫరా ఆగిపోయినా, సాధారణ ఫోన్ నెట్‌వర్క్‌లు పనిచేయకపోయినా వైర్‌లెస్ కమ్యూనికేషన్ ద్వారా వరద స్థాయి కీలక సమాచారం క్షణాల్లో పై అధికారులకు, అలాగే క్షేత్ర స్థాయి సిబ్బందికి చేరవేయడం సాధ్యమవుతుందని సాలూరు పోలీసులు తెలిపారు.

అడారు గెడ్డను పరిశీలించిన ఎస్‌పి

మక్కువ: మండలంలోని పనసభద్ర పంచాయతీ పరిధిలోని దుగ్గేరు సమీపంలో ఉన్న అడారు గెడ్డను జిల్లా ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి మంగళవారం పరిశీలించారు. తుఫాను కారణంగా గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో గిరిజనులెవరూ రాకపోకలు సాగించవద్దని ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును కూడా ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక గిరిజనులతో మాట్లాడారు. అడారుగెడ్డ ఉధృతి వల్ల రాకపోకలకు అంతరాయం కలిగే గిరిజన గ్రామాల వివరాలను కూడా ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వంశధార నది తీర ప్రాంత గ్రామాలు పరిశీలించిన డిఎస్‌పి

భామిని : ముంథా తుఫాన్ నేపథ్యంలో మండలంలోని వంశధార నది ప్రాంత గ్రామాలైన లివిరి, నేరడి గ్రామాలను మంగళవారం డీఎస్పీ రాంబాబు పరిశీలించారు. తుఫాన్ తీవ్రత నేపథ్యంలో నదిలో నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని, గ్రామస్తులెవరూ నదులోకి స్నానాకి వెళ్లొద్దని, చిన్నపిల్లలు నది వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో సిఐ ప్రసాదరావు, ఎస్సై అప్పారావు ఉన్నారు.

అసంపూర్తిగా నిలిచిపోయిన ఆశ్రమ పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మెనూ ఛార్జీలు పెంచాలి

ప్రజాశక్తి – గుమ్మలక్ష్మీపురం

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వం విద్యార్థులకు మెనూ చార్జీలు పెంచి పౌష్టికాహారమందించాలని, రక్తహీనత లేకుండా ఆరోగ్యవంతులుగా ఉంచాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎ.గంగారావు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జీపు యాత్ర ఆరో రోజు గుమ్మలక్ష్మీపురం మండలంలో సాగింది. అనంతరం పోస్ట్ మెట్రిక్ గిరిజన బాలికల వసతి గృహంలో విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ విద్యార్థుల మెనూ ఛార్జీలు చూస్తే హాస్టల్ కన్నా జైలే మేలన్నారు. రూ.55తో విద్యార్థులకు పౌష్టికాహారమందించడం సాధ్యమా అని ప్రశ్నించారు. ప్రధానమంత్రి మోడీ పుణ్యమా అని నిత్యవసర ధరలు ఆకాశానికి పెరిగాయని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌ఛార్జీలు పెంచలేదన్నారు. దీంతో చాలీచాలని ఆహారం, అరకొర మెనూ అమలు చేస్తున్నారన్నారు. పౌష్టికాహారం అందక విద్యార్థులు అనారోగ్యాలకు గురవుతున్నారని ప్రభుత్వానికి తెలిసినా చలనం లేదన్నారు. పౌష్టికాహారం, మంచి ఆరోగ్యం లేకుండా విద్యార్థి బాగా ఎలా చదువుతారో ప్రభుత్వమే చెప్పాలన్నారు. ఎటిడబ్ల్యూఒ, డిడి, గురుకుల ఒఎస్‌డి ప్రతినెలా ఆశ్రమ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల యోగక్షేమాలు చూడాలన్నారు. అటువంటి పరిశీలన నేడు కరువైందన్నారు. విద్యార్థులు అనారోగ్యంతో మరణించిన సమయంలోనే అధికారులు హడావిడి చేయడం చేస్తారన్నారు. తప్పును తప్పించుకుని కింది స్థాయి హెచ్ఎం, వార్డెన్, హెల్త్ వాలంటరీపై నెట్టేసి పాలకులు, అధికారులు బాధ్యతల నుంచి తప్పుకుంటున్నారని, ఇది చాలా దుర్మార్గమైన చర్య అన్నారు. పాఠశాలల నిర్వహణకు నిధులు కేటాయించాలన్నారు.

గిరిజన మంత్రి తొలి సంతకం అమలు ఎప్పుడు? :

గత వైసిపి ప్రభుత్వం ఎఎన్ఎం లను నియమించలేదు. మా ప్రభుత్వాన్ని గెలిపించండి మీ ఆరోగ్యం, ప్రాణాలు మా బాధ్యత అని గొప్పలు చెప్పిన కూటమి ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలను నియమిస్తామని హామీ ఇచ్చారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి మొదటి సంతకం పెట్టారు. నేటికీ అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్నా ఆరోగ్య కార్యకర్తలను నియమించలేదని విమర్శించారు. వైద్యం కోసం నిధులు కేటాయించడంలేదని, ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పుకొని కొత్తగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ లను పిపిపి పేరుతో అప్పనంగా ప్రైవేటు వ్యక్తులకు ఇస్తున్నారని ఆరోపించారు. అనారోగ్యంతో మరణించిన 16 మంది విద్యార్థుల కుటుంబాలకు రూ.50 లక్షలు ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించేంత వరకూ ఐక్యంగా విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున ప్రశ్నించాలని, విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించే వరకు పోరాటానికి సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మన్యం జిల్లా ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యులు శరత్,నాయకులు దినేష్, టి. అఖిల్ ఉన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి
గుమ్మలక్ష్మీపురంలో ఎస్ఎఫ్ఐ జీపు యాత్ర

ఆశ్రమ పాఠశాల భవన నిర్మాణ పనులు త్వరితగతిగా పూర్తి చేయాలి

కురుపాం : మొండెంఖల్ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి బి.అనిల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన జీపు యాత్రలో భాగంగా పాఠశాల భవన నిర్మాణ పనులను ఎస్ఎఫ్ఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 147 మంది విద్యార్థులు చదువుతున్నా, కానీ కనీస మౌలిక సదుపాయాలు లేవని అన్నారు. ఊరికి మధ్యలో పాఠశాల ఉండడం వల్ల వాహనాల శబ్దాలతో విద్యార్థులు బోధనకు ఇబ్బంది పడుతున్నారని, దీనివల్ల విద్యుత్‌పై సమగ్రంగా దృష్టి పెట్టలేకపోతున్నారని అన్నారు. కావున కొత్తగా నిర్మాణం చేపట్టిన భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు కొత్త భవనంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు, ఎస్ఎఫ్ఐ బృందం పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానం : ఎస్‌పి

ప్రజాశక్తి – పార్వతీపురం టౌన్

రక్తదాతలతో ఎస్‌పి మాధవరెడ్డి

రక్తదానం చేయడం వల్ల ఇతరులకు ప్రాణదాతల వుతారని ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి అన్నారు. పోలీస్ అమరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పోలీస్ మల్టీ ఫంక్షన్ హాల్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసు అమరుల త్యాగాలను, విశిష్ట సేవలను స్మరించుకుంటూ వారికి సంఘీభావం తెలుపుతూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసులు, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర అనారోగ్య పరిస్థితుల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తులను, రక్త హీనత కారణంగా ఇబ్బందులకు గురవుతున్న ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని, వారికి రక్తాన్ని అందించాలనే లక్ష్యంతో రెడ్ క్రాస్ వారి సహకారంతో రక్తదాన శిబిఆరన్ని నిర్వహిస్తున్నామన్నారు. పోలీస్ సిబ్బంది, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తాన్ని దానం చేశారు. పోలీసు సిబ్బంది, యువత, స్టూడెంట్స్ సుమారు 139 మంది స్వచ్ఛందంగా పాల్గొనగా 100 యూనిట్స్ రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ థామస్‌రెడ్డి, పట్టణ సిఐ మురళీధర్, రూరల్ సిఐ రంగనాథం, ఎఆర్ ఆర్ఐలు రాంబాబు, నాయుడు, ఆర్ఎస్ఐ లు, ఎస్సైలు, సిబ్బంది, మన్యం రెడ్ క్రాస్ చైర్మన్ ఎం.శ్రీరామమూర్తి, విజయనగం రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి రాము, ఇతర సిబ్బంది, రక్తదాతలు పాల్గొన్నారు.

రక్తదాతలకు ఎస్‌పి ప్రశంసలు

సాలూరు: పట్టణంలో గొల్లవీధి, వడ్డివీధికి చెందిన 21 మంది యువకులు రక్తదానం చేయగా, వీరిని ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి అభినందించారు. అనంతరం యువతకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిబిబి అప్పలనాయుడు పోలీసు సిబ్బంది యువత పాల్గొన్నారు.

పట్టణంలోని బ్యాండ్‌షో నిర్వహిస్తున్న పోలీసులు

ఆకట్టుకున్న పోలీస్ బ్యాండ్ షో

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ వద్ద గల వైఎస్ విగ్రహం వద్ద జిల్లా పోలీస్ బ్యాండ్ బృందం తమ వాయిద్యాలతో ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకుంది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగాలు చేసిన వారి త్యాగ నిరతిని ఎన్నడూ మరువలేమని కొనియాడుతూ వారికి శ్రద్ధాంజలి ఘటించారు. పోలీస్ బ్యాండ్ బృందం తమ వాయిద్యాలతో జోహార్లు పలికారు. ఈ కార్యక్రమాన్ని పట్టణ సిఐ మురళీధర్, పట్టణ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పర్యవేక్షించారు.

నివేదిక ఇవ్వకపోతే నిరాహార దీక్ష : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

స్థానిక పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై దర్యాప్తు చేసి నివేది అందజేస్తామని చెప్పిన అధికారులు నెలలు గడుస్తున్నా నివేదిక ఇవ్వకపోవడంతో నిరాహార దీక్ష చేస్తామని సిపిఎం నాయకులు కొల్లుసాము మూర్తి తెలిపారు. మంగళవారం ఆయన ఫిర్యాదుదారులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాంబమూర్తితో పాటు ఫిర్యాదారుడు రమేష్ మాట్లాడుతూ 15 రోజుల్లో దర్యాప్తు నివేదికను తెలియజేస్తామన్న డిపిఒ ఇప్పుడు నెలలు గడుస్తున్నా ఎందుకు దర్యాప్తు నివేదికను బయట పెట్టడం లేదని ప్రశ్నించారు. డిపిఒ దర్యాప్తు నివేదికను బయట పెట్టడానికి పాలకుల లేక అధికారులా? ఎవరు ఒత్తిడి ఉందో తెలియని పరిస్థితి ఉందని అన్నారు. కొమరాడ పంచాయతీ అభివృద్ధికి కేటాయించిన నిధులపై వస్తున్న ఆరోపణలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని గ్రీవెన్సలో మూడుసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యమన్నారు. డిపిఒపై వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కొమరాడ పంచాయతీ నిధులపై జరిపిన దర్యాప్తును వెంటనే బయట పెట్టాలని లేనిచో నవంబర్ 2న దాటిన తర్వాత కొమరాడ సచివాలయం వద్ద గ్రామస్తులతో కలిసి నిరాహార దీక్ష చేస్తామని తెలిపారు. సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు మరడాన వెంకటనాయుడు, జనసేన నాయకులు రమేష్ తదితరులు ఉన్నారు.

నేత్ర చికిత్సల కోసం వృద్ధులను తరలింపు

ప్రజాశక్తి - కురుపాం

కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో నేత్ర వైద్య శిబిరాల్లో చేసిన నేత్ర పరీక్షల్లో కేటరాక్ట్(అంతర కుసుమం), టేరిజియం(కొయ్యకండ) ఉన్న 40 మందిని గుర్తించి వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు కోసం మంగళవారం స్థానిక సామజిక ఆరోగ్య కేంద్రం నుంచి విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించినట్లు నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు. శస్త్ర చికిత్సలకు వెళ్లిన వారందరికీ ఉచిత రవాణా, వసతి, భోజనం, కళ్ళ జోళ్లు, మందులు సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యమిత్ర సురేష్ మరియు ఆషా కార్య కర్తలు పాల్గొన్నారు.

ఇకెవైసిని పరిశీలించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లక్ష్మీపురంలో మంగళవారం ఉపాధి హామీ జాబ్ కార్డుల లబ్ధిదారులకు ఇకెవైసి నమోదును పరిశీలించిన ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వెంకటరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 27,684 మంది వేతనదారులుండగా 22,276 మందికి ఇకెవైసి పూర్తయిందన్నారు. ఇంకా మిగిలిన పంచాయతీల్లో ఇకెవైసి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ ఎ.బాలకృష్ణ, ఇసి సోమేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు పాల్గొన్నారు.

పోక్సో కేసు నిందితునికి 14 రోజుల రిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పోక్సో కేసు నిందితునికి జిల్లా అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ 14రోజులు రిమాండ్‌ను విధించారు. పట్టణంలోని రామాపురం కాలనీకి చెందిన దొనక పవన్ పలు కేసుల్లో నిందితుడిగా ఉండడమే కాకుండా పట్టణ పోలీస్ స్టేషన్లో రౌడీషీట్ కూడా తెరడం జరిగింది. ఈ పవన్ ఈనెల 19న బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసు నమోదు పరారైన నేపథ్యంలో పట్టణ పోలీసులు విస్తృతంగా గాలించి, చాకచక్యంగా మంగళవారం పట్టుకొని, అరెస్టు చేసి జిల్లా అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టుకు హాజరుపర్చగా, మెజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించారు.

అలాగే ఈనెల 24న పట్టణంలో పాత బస్టాండ్ రోడ్డు పక్కనే ఉన్న అపోలో ఫార్మసీ పైన ఉన్న అయ్యప్ప స్వాముల సన్నిధానంలో రెండు మొబైల్స్ దొంగతనానికి పాల్పడిన పాత నేరస్తుడు, పోలీస్ స్టేషన్లో రౌడీషీట్ నమోదైన యాండ్రాపు రామకృష్ణ, (29) , పెద్దవీధి చాకలి బెలగాం చెందిన నిందితుడ్ని సిసి టీవీ ఫుటేజ్ ఆధారంగా మంగళవారం అరెస్టు చేసి, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని, రిమాండ్ నిమిత్తం అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు తరలించారు. వీరికి మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారని పట్టణ ఎస్ఐ గోవిందరావు మంగళవారం సాయంత్రం తెలియజేశారు.

8న ఔట్ సోర్సింగ్ జిల్లా మహాసభ

ప్రజాశక్తి -కంటోన్మెంట్

ఆంధ్రప్రదేశ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా మహాసభ నవంబర్ 8న కెఎల్ పురం కమ్యూనిటీ హాల్‌లో జరుగుతుందని జెఎసి జిల్లా అధ్యక్షులు జి.మహేంద్రబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రీను తెలిపారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికను మంగళవారం ఆ సంఘ కార్యాలయంలో విడుదల చేశారు. అనంతరం, రాష్ట్ర చైర్మన్ దూసి భానోజిరావుతో కలసి సభా స్థలాన్ని పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మహాజన సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జిల్లా కోశాధికారి పి. రాంగోపాల్, జిల్లా సభ్యులు అశోక్, ప్రసాద్, సుదీర్, రాజు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు పలు రైళ్లు రద్దు

విజయనగరం కోట : విజయనగరం రైల్వేస్టేషన్ మీదుగా వెళ్లే పలు రైళ్లు తుపాను ప్రభావం వల్ల రద్దయ్యాయని స్టేషన్ మాస్టర్ విబి రావు తెలిపారు. బుధవారం ట్రైన్ నెంబర్ 17220 విశాఖపట్నం- మచిలీపట్నం, 17244 రాయగడ-గుంటూరు, 07166 భువనేశ్వర్-రాయగడ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దయ్యాయి. 18464 బెంగుళూర్- భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయి. ఈనెల 30న 18520 విశాఖ-ముంబాయి ఎల్‌టిటి ఎక్స్‌ప్రెస్, 11019 ముంబయి -భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్, 17479 పూరి- తిరుపతి రైళ్లు రద్దయ్యాయి.

తుపాను బాధితులకు మండల టిడిపి అధ్యక్షుడు వితరణ

ప్రజాశక్తి -పాచిపెంట

తుఫాను కారణంగా పునరావాస కేంద్రాలకు చేరిన బాధితులకు మండల టిడిపి అధ్యక్షులు, పాంచాలి సర్పంచ్ గూడెపు యుగంధర్ ఆహార పొట్లాలు, దుప్పట్లు అందజేశారు. తుఫాను తగ్గేంత వరకు నిరుపేదలకు సహాయక చర్యలు చేపడతామన్నారు. పాంచాలికి చెందిన 11 మంది పేదలకు ఆహార పొట్లాలు, దుప్పట్లు అందజేయడంతో వారు సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో యుగంధర్ పరిశీలించారు. గిరిజన శిశు సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆదేశాల మేరకు టిడిపి తరపున సహాయ సహకారాలు అందిస్తున్నామని యుగంధర్ తెలిపారు.

పునరావాస కేంద్రాల్లోని బాధితులకు ఆహార పొట్లాలు అందజేస్తున్న యుగంధర్

విపత్తులో ఉన్న వారిని తక్షణమే ఆదుకోవాలి

- రైతులకు అండగా నిలవండి
- రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

ప్రజాశక్తి - పార్వతీపురం

తుపాను ప్రభావంతో విపత్కర పరిస్థితిల్లో ఉన్నవారిని తక్షణమే ఆదుకోవాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమును మంత్రి మంగళవారం సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలో వర్షాభావ పరిస్థితులను జిల్లా కలెక్టర్ డిజిటల్ స్క్రీన్ ద్వారా మంత్రికి వివరించారు. గూగుల్ మ్యాపు ద్వారా మండలాల్లోని వాతావరణ పరిస్థితిని కలెక్టర్ వివరించారు. ఈ మ్యాప్ ద్వారా ఎక్కడ ఏం జరిగినా కంట్రోల్ కంట్రోల్ రూమ్ నుంచే పరిశీలించి చర్యలు చేపట్టడం జరుగుతుందని వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రైతులకు కష్టం రాకూడదని, వారికి అండగా నిలవాలని కోరారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. వసతి గృహ, అంగన్వాడీ పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. పునరావాస కేంద్రాల ఏర్పాట్లపై ఆరా తీశారు. విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖల పాత్ర చాలా కీలకమని, కావున బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. ప్రతి రెండు గంటలకు నివేదికలు అందజేయాలని తెలిపారు. పంటలకు నష్టం వాటిల్లకుండా రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు తగిన సూచనలు చేయాలని, పంట నష్టం జరిగితే వాటిపై నివేదికలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ఎక్కడ ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా అన్ని శాఖల వారు చూడాలన్నారు. వసతి గృహల్లో పిల్లలకు ఆరోగ్యం బాగాలేకపోతే వెంటనే వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మంత్రి, కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లతో మున్సిపాలిటీ పరిధిలో గల బైపాస్ కాలనీలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని, ఎస్సి ప్రభుత్వ బాలుర వసతి గహాన్ని సందర్శించి పిల్లలు అందిస్తున్న ఆహారంపై ఆరా తీశారు. సమావేశంలో జిల్లా ప్రత్యేక అధికారి నారాయణ భరత్ గుప్తా, జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి, జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తుపాను ప్రభావిత గ్రామాలను సందర్శించిన సబ్ కలెక్టర్

పార్వతీపురంటౌన్ : పట్టణంలోని కోట వీధిలోని తుఫాను ప్రభావిత గృహాలను సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలతో ఆమె మాట్లాడారు. అధికారులు తీసుకుంటున్న చర్యలకు ప్రజలు సహకరించాలని కోరారు. ముంపు ప్రాంత ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని, అక్కడ నాణ్యమైన ఆహారంతో పాటు అన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. అనంతరం స్థానిక వైటిసిలో ఏర్పాటు చేసిన తుఫాను పునరావాస కేంద్రాన్ని సబ్ కలెక్టర్ పరిశీలించి, ఆశ్రయం పొందిన ప్రజలకు అన్ని సౌకర్యాలను కల్పించాలని సూచించారు. ఈ పర్యటనలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను ఆమె మంగళవారం సందర్శించారు. ప్రజలను అప్రమత్తం చేయడంలో అధికారులు తీసుకున్న జాగ్రత్తలు అడిగి తెలుసుకుని, పలు సూచనలు చేశారు. గ్రామాల్లో తుఫాన్ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. కొండశిఖర గ్రామాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.

కొండ శిఖర గ్రామాల్లో అధికారులు పర్యటన

మండలంలోని కొండ శిఖర గ్రామాలు, లోతట్టు ప్రాంతాల్లో అధికారులు మంగళవారం పర్యటించారు. తుఫాన్ వచ్చే సమయంలో ఈదురు గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తుఫాను సమయంలో జాగ్రత్తలు, భద్రత చర్యలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎల్.శ్రీవాసరావు, ఎస్ఐ బిడ్డిక శివప్రసాద్, ఎంఇఒ చంద్రశేఖర్, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ఎమ్మెల్యే పర్యటన

కురుపాం : తుపాను నేపథ్యంలో ప్రజలను అధికారులు అప్రమత్తం చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని లేవిడి, గుంజరాడ, బొడ్డమానుగూడ గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలను, కొండవాగులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కె.జయతో మాట్లాడి శిథిలావ్యవస్థలో ఇళ్లు, పూరి గుడిసెల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాల్లో ఉండేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ పర్యటనలో మండల ప్రత్యేక అధికారి ధర్మచంద్రారెడ్డి, మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, ఎస్సై పి.నారాయణరావు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల లోనే ఉండాలి

తుఫాన్ భారీ వర్షాలతో ప్రజలు ఇళ్లలోనే ఉండాలని, నీటి ట్యాంకులు నింపుకోవాలని సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు బొత్తాడ గౌరీ శంకరరావు కోరారు. కొండ వీధిలో సచివాలయ సిబ్బందితో కలిసి పర్యటించారు. పాత ఇళ్లలోని ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని సూచించారు. మొబైల్ ఛార్జింగ్ పెట్టుకోవాలని, ఒకరికొకరు సమాచారం పంచుకోవాలని సూచించారు.

తుఫాన్ సమయంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలను ఉపయోగించుకోవాలని ఎస్‌టి కమిషన్ సభ్యులు కద్రక మల్లేశ్వరరావు కోరారు. దుమ్మంగి, గుణద గిరిజన గ్రామాల్లో పర్యటించారు. అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప ఇంటి నుంచి బయటకు రావద్దన్నారు. గిరిజనులు కొండపోడు వ్యవసాయం పనులు వాయిదా వేసుకోవాలని, చెట్ల కింద విద్యుత్ స్తంభాలకు దగ్గరగా ఉండరాదని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలక క్రాంతికుమార్, నాయకులు మండంగి భూషణ, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

కొమరాడ : నదీ పరివాక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, ఎంపిడిఒ ఎస్.రమేష్, ఎస్ఐ కె.నీలకంఠం అన్నారు. నాగావళి నది పరివాహక ప్రాంతాలైనా పూర్ణపాడు తదితర ప్రాంతాలను అధికార బృందం పర్యటించింది. నదీ పరవాహక ప్రాంతాల ప్రజలు వరద ప్రవాహం పెరిగే సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వర్షాలు భారీగా కురుస్తున్న నేపథ్యంలో నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని, కావున ఎట్టి పరిస్థితులను ప్రజలెవరూ నదిలోకి దిగకూడదని హెచ్చరికలు జారీ చేశారు. నాగావళి నది అవల ఉన్న మాదిలింగి వద్ద ఉన్న గుమ్మిడిగెడ్డపై నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉండడంతో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు అవగాహన కల్పించి రాకపోకలు చేయకుండా ఉండేందుకు సిబ్బంది చర్యలు చేపట్టారు. ఈ పర్యటనలు సిబ్బంది పాల్గొని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

పెద్దగెడ్డ ప్రాజెక్టును పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ వైశాలి

పాలకొండ : తుఫాన్ నేపథ్యంలో మన్యం జిల్లా ప్రత్యేక అధికారిగా నియమితమైన మన్మధరావు పాలకొండ డివిజన్ పరిధిలో పర్యటించారు. అన్నవరంలో తహశీల్దార్, ఎస్సై ఆయన వెంట పర్యటించారు. తుఫాన్ ఉధృతి అవుతున్న నేపథ్యంలో అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ పరిధిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలో అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

సీతంపేట : తుఫాన్ పట్ల అప్రమత్తంగా వ్యవహరించి ఐటిడిఎ పరిధిలోని అన్ని పాఠశాలలోని విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ సూచించారు. మండలంలోని హడ్డుబంగి బాలికల ఆశ్రమ పాఠశాల, మల్లిలోని బాలుర ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులెవరు బయట తిరగకూడదని సూచించారు. అనంతరం కుసిమి పిహెచ్‌సిని సందర్శించారు. కార్యక్రమంలో డిడి అన్నదొర వైద్య సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : తుఫాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ప్రసన్నకుమార్, ఇన్చార్జి ఎంపిడిఒ పి.వెంకటరావు అన్నారు. మండలంలోని బూర్జ, సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో తుఫాను పునరావస కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే సువర్ణముఖి నదిని పరిశీలించారు. స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్ములేని లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో గ్రామాల్లో తుఫాను పట్ల ప్రజలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎస్సై ఎం.రాజేష్, ఎఇ ఎస్.అవినాష్, ఎంఇఒ జి.సూర్యదేముడు, ఎం.వెంకటరమణతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని గడగమ్మ, దశమం తపురంలో మంగళవారం ఎంపిడిఒ బి.వెంకటరమణ, తహశీల్దార్ ఎఎస్ కామేశ్వరరావు, ఎస్సై జి.కళాధర్ తుఫాను ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు రావాలని, లేకుంటే గృహాల్లోనే ఉండాలన్నారు. అలాగే పూరిపాకల ఉండొద్దని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పాలకొండ అగ్నిమాపక శకటం ద్వారా మాక్ డ్రిల్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాలకొండ అగ్నిమాపక ఎస్సై జామి సర్వేశ్వరరావు, హౌసింగ్ ఎఇ వినోద్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు పి.తిరుపతి, దిలీప్ కుమార్, సచివాలయాల సిబ్బంది, విఆర్వోలు, గ్రామస్తులు ,పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలను పరిశీలించిన ప్రత్యేక అధికారి

భామిని : తుఫాన్ నేపథ్యంలో అధికారుల సూచన మేరకు మండలంలో ఏర్పాటు చేసిన ఐదు తుఫాన్ పునరావాస కేంద్రాలను మొంథా తుపాను ప్రత్యేక అధికారి, ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ పి.రమాదేవి పరిశీలించారు. ప్రస్తుతం ఈ పునరావాస కేంద్రాల్లో నిర్వాసితులెవరూ లేరని తహశీల్దార్ శివన్నారాయణ తెలిపారు. అనంతరం నది తీర ప్రాంత గ్రామాలైన సింగిడి, లివిరిని, మండల పరిషత్ కార్యాలయం లోని కంట్రోల్ రూమ్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వసంతకుమారి, ఆర్ఐ మణిప్రభాకర్, సిబ్బంది ఉన్నారు.

సాలూరు : తుఫాన్ కారణంగా ఎటువంటి సమస్యలు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలంటూ మండల ప్రత్యేక అధికారి, రామారావు, ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి సిబ్బందికి సూచించారు. సచివాలయాలకు వెళ్లి సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేసారు. మండలంలోని అంటివలస, తోణాం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని హెచ్ఎం, వార్డెన్లను ఆదేశించారు. దండిగాం, తోణాం, కురుకూటి, దళాయి వలస, సారిక గ్రామాల సమీపంలో వాగులు పొంగుతాయని, కావున ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఇచ్చేందుకు దండిగాం, తోణాం వద్ద మహిళా పోలీసులను ఏర్పాటు చేసి, వారికి వాకీ టాకీలను సమకూర్చామన్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత కేంద్రాలకు తరలింపు

పట్టణంలోని లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు మున్సిపల్ కమిషనర్ టిటి రత్న కుమార్ తెలిపారు. రైల్వే స్టేషన్ రోడ్డు, దండిగాం రోడ్డు, గుమ్మడం మరియు బైపాస్ రోడ్డు పక్కన ఉన్న పాత భవనాలలో, రేకుల ఇళ్లలో, పెంకిటి ఇళ్లలో, చెట్ల కింద నివసిస్తున్న ప్రజలను గుర్తించి ప్రజలందరినీ ముందస్తు చర్యగా వైటిసి భవనం (గుమ్మడం రోడ్డు)లోని పునరావాస కేంద్రానికి సురక్షితంగా తరలించిన్నట్లు అయన తెలిపారు. తాత్కాలిక ఆశ్రయం, ఆహార పదార్థాలు అందించేందుకు మున్సిపాలిటీ పరిధిలో కెహెచ్ స్కూల్, డబ్బి వీధిలో భాష్యం స్కూల్, దండిగం రోడ్డు, వైటిసి భవనం, గుమ్మడం రోడ్డులో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్, లెప్రసీ ఆస్పత్రి, రామ టాకీస్ రహదారులను తాత్కాలికంగా కొంత భాగాన్ని నిలిపివేశామని, దీన్ని ప్రజలు గమనించి నీరుపై నుండి ఉధృతంగా వచ్చే అవకాశాలున్నందున ప్రయాణాలను తగ్గించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ సిఐ బి.అప్పల నాయుడు, తహశీల్దార్ నీలకంఠరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, నీడ్ స్వచ్ఛంద సంస్థ మేనేజర్ వేణు గోపాలరావు, మున్సిపల్, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి, కలెక్టర్

నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు : కలెక్టర్

పార్వతీపురం: తుపానును దృష్టిలో పెట్టుకొని జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో అన్ని వసతులను కల్పించాలని జిల్లా కలెక్టర్ డా ఎన్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ సిబ్బంది 24 గంటలూ విధులను నిర్వహించాలని స్పష్టం చేశారు. రేషన్ సరుకులు, తాగునీరు, మందులు, ఇతర అవసరమైన వస్తువులన్నటినీ ఏర్పాట్లు పై మంగళవారం సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్అండ్‌బి, మున్సిపల్ కమిషనర్లు, వైద్య ఆరోగ్య, విద్యా, మహిళా శిశు సంక్షేమ, విపత్తుల నివారణ, పౌరసఫరాలు తదితర శాఖల సమావేశం నిర్వహించి వారు నేటికీ చేపట్టిన పనుకపై ఆరా తీశారు. విపత్తు సమయంలో నిర్లక్ష్యం వహిస్తే ఊక్షించేది లేదన్నారు. పునరావాస కేంద్రం గురించి దగ్గరలో ఉన్న కుటుంబాలకి తెలిపేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ సమస్య ఎదురైతే 1912 కి కాల్ చేయాలనే అవగాహనా కల్పించాలన్నారు. ఏమైనా విపత్తు సంభవిస్తే వెంటనే కంట్రోల్ రూమ్ కి తెలియజేయాలి. అలాగే కట్ ఆఫ్ రూట్స్ వెంటనే తెలియజేయాలన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికీ మంచి ఆహారం అందించాలన్నారు. ప్రతీ ఒక్కరూ వారు పనిచేస్తున్న ప్రధాన కేంద్రాల్లోనే ఉండాలని హెచ్చరించారు. టామ్ టామ్ వేయించి అందరికి అప్రమత్తం చేయాలన్నారు.

దెబ్బతిన్న ఫుట్‌పాత్, చిల్లర వర్తకుల జీవనం

పార్వతీపురంటౌన్ : మొంథా తుఫాన్ ప్రభావం వల్ల పట్టణ ప్రధాన రహదారితో పాటు పలు కూడళ్ల జనసంచారం లేక బోసిపోయాయి. జిల్లా కేంద్రానికి పరిసర గ్రామాల నుంచి ప్రజలెవరు రాకపోవడంతో అమ్మకాలు, కొనుగోలు జరగక అన్ని రకాల దుకాణాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా ప్రధాన రహదారికిరు వైపులా ఉన్న ఫుట్ పాత్, చిల్లర వ్యాపారులు తాము కొనుగోలు చేసి తెచ్చుకున్న వస్తువుల అమ్మకాలు జరగకపోవడంతో నిస్సహాయంగా కొనుగోలు దారులు రాక కోసం వేచి చూస్తున్నారు. మరో రెండు రోజులు తుఫాను పరిస్థితి ఇలాగే ఉంటే తమ కుటుంబ జీవనం ఎలా గడుస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలన్న నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేసి తీరాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మెడికల్ కాలేజీల ప్రవేటీకరణకు వ్యతిరేకంగా పట్టణంలో 14వ వార్డులో గల బైపాస్ కాలనీలో కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమమాన్ని మంగళవారం చేపట్టారు. స్థానిక వైసిపి ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి జోగారావు గడప గడపకు వెళ్లి ప్రజలను కలుసుకుని వారితో మాట్లాడుదారు. పార్వతీపురంలో మెడికల్ కాలేజీతో పాటు సామాన్యులకు మెరుగైన వైద్యమందించేందుకు 400 పడకల సూపర్‌స్పెషాలిటీ ప్రభుత్వాసుపత్రిని నిర్మించామని, దీనివల్ల పేదలకు వైద్య విద్యను అందుబాటులో ఉండాలని సంకల్పించారని అన్నారు. అయితే కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తయితే జగన్‌కు మంచి పేరు వస్తాదన్న దురాలోచనతో కూటమి ప్రభుత్వం తన అనుయాయులకు కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆస్తులను కట్టబెట్టడం కోసం వాటిని ప్రైవేటీకరించాలనే నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి ఆధ్వర్యంలో చేపడుతున్న కోటి సంతకాల ప్రజా ఉద్యమానికి ప్రజలంతా మద్దతు పలికి, కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా వైసిపి ప్రధాన కార్యదర్శి పోల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సరివిశెట్టి శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్ సభ్యులు కోరాడ లావణ్య, నిమ్మకాయల సుధీర్, బీసీ సెల్ అధ్యక్షులు గొర్లి మాధవరావు, రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి యాండ్రాపు తిరుపతి రావు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి భూతల వెంకటరమణ, పార్టీ ప్రతినిధులు పేకల రాధ, సారికి ఉమాదేవి, చింతగడ లక్ష్మీ, అలజంగి జితేంద్ర, చింతాడ రాజేష్, చింతాడ శైలజ, మాతా రమణ, దివిలి ఉమామహేశ్వరరావు, దుర్గా, వివిధ వార్డుల కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి సంతకాలు సేకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

వీరఘట్టం : మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మండలంలోని కత్తులకవిటిలో జడ్పిటిసి జంపు కన్నతల్లి -ఉమామహేశ్వర రావు ఆధ్వర్యంలో మంగళవారం రచ్చబండ కార్యక్రమంలో భాగంగా కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి జంపు కన్నతల్లి- ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పేదలకు వైద్యం అందనీయకుండా చేస్తుందని, ఇది సరైన విధానం కాదని ఆమె అన్నారు. ప్రభుత్వ అనాలోచిత విధానాల వల్ల ప్రజలకు మెరుగైన వైద్యం దూరమవుతుందని,. వీటిని ప్రజలు గ్రహిస్తున్నారని అన్నారు. అనంతరం ప్రజా వైద్యం ప్రజల హక్కు కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచి గేదెల సరోజిని సుదర్శన్, ఎంపిటిసి సభ్యులు కొత్తవలస పరిమళతో పాటు వైసిపి కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.

ప్రజా వైద్యం ప్రజల హక్కు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

జిల్లా కేంద్రాస్పత్రి రోడ్లను బాగు చేయండి

కలెక్టర్‌కు ఎమ్మెల్యే అదితి లేఖ

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా కేంద్రంలోని మహారాజ ప్రభుత్వాసుపత్రికి వెళ్లే ప్రధాన రహదారితో పాటు ఆస్పత్రి ఆవరణలోని రహదారులు దెబ్బతిన్నందున వెంటనే బాగు చేయించాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డికి ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు లేఖ రాశారు. ఆసుపత్రికి నిత్యం ఉమ్మడి విజయనగరం జిల్లా నుండి వందలాది మంది వైద్యం కోసం వస్తుంటారని, ఆసుపత్రికి వెళ్లే ప్రధాన రహదారితో పాటు ఆసుపత్రి ఆవరణలో రహదారులు కూడా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగడమే కాక, రోగులు, సహాయకులు, ఆసుపత్రి సిబ్బంది, సందర్శకులకు, ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల సమయంలో రోగులకు చాలా అసౌకర్యాన్ని కలిగిస్తోందని, అందుచేత ప్రజారోగ్యం , భద్రత దష్ట్యా, ఆసుపత్రి ప్రాంగణంలో నూతన రహదారులను త్వరగా నిర్మించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

భోజనం ఏర్పాటు చేసిన సర్పంచ్ గౌరీ శంకర్ రావు

క్రీడాకారుల నగదు ప్రోత్సాహాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారుల నుండి నగదు ప్రోత్సాహక పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడా శాఖ అధికారి ఎస్ వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి రాష్ట్రానికి గౌరవం తెచ్చిన ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, ప్రోత్సహించి, సత్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నగదు ప్రోత్సాహక పథకాన్ని ప్రకటించినట్లు శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు తెలిపారన్నారు. క్రీడాకారులు తమ దరఖాస్తులను. SAAP Kreeda App ద్వారా లేదా https://sports.ap.gov.in లో రిజిస్ట్రేషన్ చేసుకొని నవంబర్ 4లోగా పంపాలని తెలిపారు. సమర్పించుకోవచ్చు. గడువు తరువాత సమర్పించిన దరఖాస్తులు పరిగణనలోకి తీసుకోబడవని తెలిపారు. వివరాలకు 9573552108, 8247302497, 9553821065 నంబర్లను సంప్రదించాలని కోరారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డులోని గాంధీ బొమ్మ దగ్గర మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. మారుతీ కాలనీకి చెందిన బండారు చిన్నారావు రోడ్డు పక్కన నిలుచొని ఉండగా ఒడిషా నుంచి బాడంగి వైపు వెళుతున్న లారీ అతనిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సిహెచ్‌సికి తరలించి పోలీసులు కేసు నమోదుచేశారు.

రైల్వే ప్రయాణికుల కోసం ప్రత్యేక టీమ్‌లు

ప్రజాశక్తి - బొబ్బిలి

రైల్వే ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా క్విక్ రెస్పాన్స్ టీములను ఏర్పాటు చేసినట్లు ఆర్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ చంద్రపండా చెప్పారు. రైల్వే స్టేషన్లో మంగళవారం టీమ్ సభ్యులతో కలిసి మాట్లాడుతూ రైలు ప్రయాణికులు భోజనం, తాగునీరు లేక ఇబ్బందులు పడితే వారికి వాటర్ బాటిల్స్, భోజనాలు, బిస్కెట్ ప్యాకెట్స్ అందిస్తామని చెప్పారు. రైల్వే ట్రాక్ డామేజ్ అవ్వకుండా పర్యవేక్షణ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

గడ్డి కాలనీలో పునరావాస కేంద్రం

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీ పురం

స్థానిక గడ్డి కాలనీ ఎంపిపి స్కూల్లో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ ఉన్న మూడు కుటుంబాలకు రాత్రి భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌరీ శంకర్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు. రెండు కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు.

తుపానుతో రైతుల్లో వణుకు

సీతంపేట: మొంథా తుఫాన్‌తో ఏజెన్సీలో రైతుల్లో వణుకు పుడతుంది. ఇప్పటికే వరి పంట పొట్ట దశలో ఉంది. కొన్నిచోట్ల దీంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికే అధికారులు అప్రమత్తం చేశారు. ఏజెన్సీలో వర్షపాతం తక్కువగా నమోదు అవుతుంది. మరోపక్క ఉద్యానవనాలకు ఎటువంటి నష్టం లేదని అధికారులు చెబుతున్నారు. ఈ వర్షాలతో రహదారులు జలమయమయ్యాయి.